# మనసు గారడి



కథ

వడలి రాధాకృష్ణ

గుడిలోని సుప్రభాతానికి ముందే...

పంపానది నిద్రలేచి పరవళ్ళు తొక్కక ముందే నిద్ర లేచింది అపర్ణ. మీద కాళ్ళు వేసి తనను కరుచు పడుకున్న నలుగురు పిల్లల్ని తప్పించి లేచి కూర్చుంది.

జీరో కేండిల్ బెడ్‌లైట్ ఆరిపోయింది. దాని స్థానంలో అరవై కేండిల్ బల్బు వెలగడంతో ఆ గది అంతా వెలుతురు పరుచుకొంది. "ఘనాపాటి ఇంకా లేచినట్లు లేదు. వారికి ముందే పిల్లల్ని తయారు చేసి చదువుకి సిద్ధం చెయ్యాలి" ఆ ఊహ మనసులోకి రావడం తడవు అపర్ణలోని బద్ధకం ఎక్కడికక్కడ ఎగిరిపోయింది.

బయట వాచ్‌మెన్ పడుకున్న షెడ్‌లో అలికిడి అయింది. అపర్ణమ్మ లేచిందంటే మూడున్నర అయినట్లు లెక్క. వాచీ చూసుకున్నాడు. అవును... తెల్లారకట్ల సరిగ్గా మూడున్నర గంట లయింది.

తన చేతుల్ని ఒకదానితో ఒకటి రాపిడి చేసి, ఆవెచ్చదనాన్ని ముఖానికి అద్దుకొని, కళ్ళు తెరిచి చేతుల్లోకి చూసుకొంది. కోమలమైన తన అరచేతుల్లో అన్నవరం సత్యదేవుని చూసుకొంది.

'బుజ్జీలు' నెమ్మదిగా నిద్ర లేపింది పిల్లల్ని. అక్కయ్య పిలుపుకి చటుక్కున మెలుకువ వచ్చింది ఆ చిన్నారులకి. లేవడం తడవు తమ దినచర్యల వైపు కదిలారు వాళ్ళు. వేదాధ్యయనం ప్రారంభానికి ముందు ఆ సత్రం ముంగిట కళ్ళాపు చల్లి ముగ్గు వేసింది అపర్ణ.

వంటశాలలో ఆచార్యులు కాఫీ తయారుకు ఉపక్రమించారు. వారికి కావాల్సిన సామాగ్రి నంతా సమకూర్చింది ఆమె.

అపర్ణ లేనిదే అక్కడ ఎవరికీ కాలు చెయ్యి ఆడదు. ఒక్కమాటలో చెప్పాలంటే ఆమె లేకపోతే ఎవరికీ తెల్లవారదు. వేకువజాము నుండి రాత్రివేళ దాకా అక్కడ వంటకు కావాల్సిన సరుకుల్ని సమకూర్చడం, అందరితోను కలివిడిగా ఉండటం, ఘనాపాఠీవారి వేదాధ్యయనానికి ఏర్పాట్లు చూడటం, వచ్చే యాత్రికులను మర్యాదగా పలకరించడం ఆమె దినచర్య.

సాత్వికమైన ఆహారం తినే అపర్ణలాంటి వ్యక్తుల రంగు, రుచి, వాసన ఎప్పుడూ వేరుగా గుబాళిస్తూనే ఉంటాయి. తద్భిన్నం తద్భిన్నమే.

** ** **

'వద్దు అక్కడే! వాళ్లు ఎంత చెబుతున్నా వినే స్థితిలో లేడు కామేష్.

ఏదో చెబుదామని చలపతి ప్రయత్నం చేస్తున్నాడే గాని 'ససేమిరా' అన్నమాటే అతని నోటి నుండి.

"ఎందుకురా! ఎదురుగా మధులతా ఇంటర్నేషనల్ కన్పిస్తూంటే" శర్మ మాట అది.

"కుదరదన్నానా!" మళ్ళీ మొరాయించడమే గాని వేరు మాట లేదు కామేష్ నుండి.

"పోనీలేరా! వాడి ఇంట్రెస్ట్ వాడిది" చలపతి అందుకున్నాడు కామేష్‌ని ఒకింత సమర్థిస్తూ.

"సరే వాడి ఇష్టం! ఆ సత్రంలో సరిగ్గా కరెంటు ఉండకపోవచ్చు, తాగడానికి మంచినీరు దొరక్కపోవచ్చు, ఒత్తి చాపమీద పడుకోవలసి రావచ్చు.

"అయినా మన బస అక్కడే. దేవుడి దర్శనానికొచ్చిన వాళ్ళకి ఏ.సి., ఇంటర్నేషనల్స్... డీలక్స్ లాంజ్‌లు ఎందుకో?" కామేష్ మాటకి ఆ ప్రాతఃసంధ్యవేళ రత్నగిరి కొండమీద విద్యుత్ వెలుగులతో వెలిగిపోతున్న సత్యదేవుని గాలిగోపురం మీది బంగారు శిఖరం చటుక్కున మెరిసింది.

"అయితే మనవాడి చేత ఇప్పుడే ఇక్కడే రిహార్సల్స్ చేయించి..." నవ్వుతూ అన్నాడు చలపతి ఆటోవాలాకి చార్జస్ పే చేస్తూ.

"రిహార్సల్స్ ఏమిటి స్టేజ్ ప్రాపర్టీస్‌తో వచ్చేస్తేను" వాళ్ళ నవ్వుతో తనూ జత కలిపాడు కామేష్, మొలలోని యజ్ఞోపవీతాన్ని బయటకు తీస్తూ.

"వెల్ ప్రిపరేషన్ యా!" శర్మ మెచ్చుకోలుగా అన్నాడు బ్యాగ్‌లో షావల్‌ని బయటకు తీస్తూ.

కామేష్‌కి కూడా చలిగానే ఉంది. శీతలత పక్కకు తొలగిపోతుంటే, వేసవివేళ్ళు చొచ్చుకుంటున్నాయి. హేమంతుడు తన ఉనికి కోసం తంటాలు పడుతూనే ఉన్నాడు. తనూ మఫ్లర్ బయటకు తీసి ముఖం మీదుగా తలకు చుట్టుకున్నాడు.

"కామూ! శీతాకాలంలో తలకు మఫ్లర్ వేసుకుంటే చలిగాలుల్ని చెవుల గుండా లోపలికి చొచ్చుకుపోకుండా ఆపుతుంది. దానితో మెదడు మొద్దుబారదు, శరీరం చురుకుదనం కోల్పోదు" ఆనాటి మధుసూదన శాస్త్రి మాటలు



గుర్తుకువచ్చాయి కామేష్‌కి.

మాటలతో బాటు చిన్నగా నవ్వూ వచ్చింది. శాస్త్రి క్రమశిక్షణ, ఉక్కు సంకల్పం అప్పట్లో కొంచెం కొంచెం ఇబ్బందిగానే ఉండేది కామేష్‌కి. కానీ ఆ కరుకుదనం అంచున ఉన్న ఆనందం ఎంతగానో నచ్చేది తనకు.

తమ చిన్న ఊరిలో పెద్ద శాస్త్రిగారాయన. ఈ కాలపు మనుషుల్లా గాక సిసలైన వ్యక్తిత్వానికి అసలైన చిరునామా మధుసూదన మాష్టారు.

"ఒరేయ్! శాస్త్రిగారి దగ్గర నిన్ను ఎందుకు పెడుతున్నానో తెల్సా!! మంచి బుద్ధులు నేర్చుకుంటావని" ఆనాడు తండ్రి నారాయణయ్య అంటుంటే అసలు అర్థంగాక అడ్డంగా తలూపాడు కామేష్.

చలపతి, శర్మ, సుబ్బలక్ష్మి వాళ్ళంతా తనకు ప్రాణమిత్రులు. వాళ్ళు ఆయన దగ్గర ట్యూషన్‌కి వెళ్ళి చదువుకొనేవారు. వాళ్ళతోబాటు తనూను. ఆనాడే రెసిడెన్షియల్ స్కూల్స్ అంటూ, స్పెషల్ కోచింగ్ సెంటర్స్ అంటూ విద్యా విధానంలో విప్లవాత్మకమైన మార్పులు వస్తున్నా నారాయణయ్య కొడుకు విషయంలో మధుసూదనశాస్త్రి ఆలంబననే ఆశ్రయించాడు.

చదువుకోక మొండికేసినపుడు మధుసూదన శాస్త్రిగారి తీక్షణ స్వభావం కామేష్‌తోసహా శిష్య బృందం అందరికీ ఇబ్బందిగానే ఉండేది. కానీ ఆయనచుట్టూ...ఆ ఇంటి వాతావరణం చుట్టూ అల్పత్వానికి అతీతమైన మానవ పరిమళం నిరంతరం గుబాళిస్తూనే ఉండేది.

విద్యార్థులందరూ ఆయనింట కంచంలో భోజనం చేసేవారు. మంచాల మీద సేద దీరేవారు. ఆ ఇంటి దండెంమీద బట్టలయేవారు.

సాధారణంగా గురువుగారి గొప్ప మనసుకు దాసోహమన్పించినా లోలోపల ఏదో వేదన... అర్థంలేని తపన.

"కామూ! లాగర్‌థమ్స్ బాగానే లాగుతున్నావ్. ట్రిగొనామిట్రీని ఇంకా ట్రై చెయ్యాలి" మాష్టారు అన్నమాటల్ని బాగానే అస్తిన పెట్టుకొనేవాడు కామేష్. కానీ సాధ్యాసాధ్యాల మధ్య ఊగిసలాడే కామేష్ ఎప్పుడూ మనుషులు, మనుషుల వ్యక్తిత్వాల బేరీజుల మధ్య కూడ తేలియాడుతూ ఉండేవాడు. తండ్రి నారాయణ మధుసూదన శాస్త్రికి అంతగా ఒదిగి ఉండటం అంతగా రుచించేది గాదు కామేష్‌కి.

"గురువుగారూ! మీరు ఆచార సాంప్రదాయాలకు ప్రాణమిచ్చే ఉన్నతులు. అటువంటి మీ మధ్య ఉంటే నా కొడుకు కూడా మనిషి అన్పించుకుంటాడని నా ఆశ" తండ్రి మాటలకి విపరీతంగా స్పందించేవాడు కామేష్.

ఆయన మాటలు బానిసత్వపు బతుకులను

**చక్కని మాట తీరు... మాటలలో అభిమానం...మంద్రత గొలిపే యవ్వనం...ప్రేరేపింపజేసే అవయవ సంపద. కామేష్‌లో ఏదో మధురమైన బాధ. దాని నడుమ తనలో కరడు గట్టిన చిరకాల వేదన. దానికి ప్రతీకలా ఆ సత్రంలోని పారిజాతం అపర్ణ కనబడుతోంది.**

తలపుకు తెచ్చేవి. లోంగుబాటు ధోరణి ప్రస్ఫుటమయ్యేది. "మనిషిని మనిషి వివేకం ముసుగులో వ్యక్తిత్వం పేరిట తీయటి కబుర్లు చెప్పి లొంగదీసుకోవడానికి ప్రయత్నించడం... అణచివేయాలనుకోవడం..." వయసుకు మించిన ఆలోచనలు కామేష్‌ని అతలాకుతలం చేస్తుండేవి. మనసులో వేదన బడబాగ్నిలా రగులుకుంటున్నా పైకి మటుకు మధుసూదనశాస్త్రి దగ్గర శిష్యరికం సవ్యంగానే సాగిపోయింది.

"మీవాడు చాలా తెలివైనవాడు నారాయణా. భవిష్యత్తు అంతా వాడికోసం ఎదురుచూస్తోంది" మరోవైపు శాస్త్రిగారి మాటలు ఎంతగానో ప్రభావితం చేసేవి కామేష్‌ని. ఎలాగోలా గాడి తప్పుతున్న క్రమశిక్షణను, అవధులు దాటుతున్న మానసిక సంఘర్షణను అదుపులో పెట్టుకొని చదువు కొనసాగించాడు. స్వతహాగా తెలివితేటలు గల్గిన కామేష్ శ్రద్ధాసక్తులను చూసి మురిసిపోయేవారు మధుసూదనశాస్త్రి.

"కాము నా ప్రియశిష్యుడండీ! నాకు మంచి పేరు తీసుకురాగల చావ ఉన్నవాడు" అంటూ అందరికీ అపురూపంగా చెప్పేవారాయన. చివరికి చలపతి, శర్మ, సుబ్బలక్ష్మి అందరికీ తెలియని డౌట్స్ క్లారిఫై చేసే స్థాయికి ఎదిగాడు. మొత్తానికి మంచి మార్కులతో డిగ్రీ సంపాదించాడు. క్యాంపస్ ఇంటర్వ్యూతో పేరున్న కంపెనీలో ఎగ్జిక్యూటివ్‌గా చేరాడు.

ఉన్నతితో వ్యక్తిత్వం ఊపందుకొని గుబాళిస్తున్నా తెలియని పొరపొచ్చాల మధ్య ఈర్ష్య, అసూయ, ద్వేషం అతన్ని చుట్టుముట్టి నిరంతరం అతలాకుతలం జేస్తూనే ఉంది.

సామాజికంగా ఎంతగానో పురోగమిస్తున్నా, మనుషుల మధ్య కులతత్వాలు, వర్గవైషమ్యాలు, తీసికట్టు పోకడలు, పక్షపాత వైఖరులు, బంధుప్రీతి, అసమానతలు నెలకొన్న ఈసమాజంలోని ఎన్నెన్నో అంశాలు కామేష్‌ని ప్రభావితం జేసేవి.

తన ప్రమేయం లేకుండానే మనసు రెచ్చగొట్టబడేది. ఒక్కోసారి తన హృదయమే తనకు ఎదురునిల్చి నిలదీసేది. మనిషి మనుగడకు కులం మత్తు ప్రతిబంధకం అవుతూంటే... జాతి నిరంతరం చతికిలబడుతూనే ఉంటుంది.

"పౌరోహిత్యాలు...పూజాదిక్రతువులు, వ్రతాలు... వైదీక క్రతువులు, అభిషేకాలు... ఆశీర్వచనాలు" వీటి పేరిట బ్రాహ్మణులను అధికులుగా జేయడం, బ్రాహ్మణవాదం దృఢంగా సమాజంలో వేళ్ళూనుకొని పోవడం, తలచుకుంటే ఆత్మవిశ్వాసం కదనంతొక్కేది కామేష్‌లో.

ఆలోచిస్తూంటే ప్రతీకారపు ధోరణి తన్నుకొస్తోంది. ఒక బ్రాహ్మణ స్త్రీ మీద ఆధిపత్యం చెలాయించాలన్న దుగ్ధ ప్రస్ఫుటంగా కన్పిస్తోంది ఆ క్షణాన కామేష్‌లో. అపుడు అన్నీ ఏవరేజ్ కాబడి సిస్టం కాలిబ్రేట్ అవుతుంది. ఆ క్షణం నుండి అగ్రహారంలోని అగ్రకులాలు ఆలంబన కాసాగాయి.


ఒకసారి శ్రీరామనవమికి చలపతి, శర్మలతో భద్రాచలం టూర్‌కి వెళ్ళాడు. అక్కడ ఎకామ్‌డేషన్ ప్రాబ్లెమ్ అయింది.

"ఎందుకులేరా! ఎక్కడో ఎడ్జెస్ట్ అయిపోతే సరి. అక్కడ నేను ఏం బాగుంటుంది చెప్పు" అన్నాడు మొహమాటపడుతూ.

"ఈ గాయత్రీ బ్రాహ్మణ సత్రంలో ట్రై జేస్తే సరి" చలపతి అనేసరికి అతని ముఖంలోకి చూశాడు కామేష్.

హంగులూ, ఆర్భాటాలు లేని ప్రదేశం, ప్రశాంతమైన జీవన విధానానికి ప్రతీకలా కనబడుతోంది అక్కడి వాతావరణం. గోదావరిలో స్నానం, మడి, సంధ్య, అర్చన వగైరా పునస్కారాలతో మునిగిపోయి ఉన్నారు అందరూ. ఆనందంగానే ఉంది కామేష్‌కి. కానీ లోలోపల అసహనం రాజుకుంటూనే ఉంది. ఎందరో మధుసూదన శాస్త్రుల్లక్కడ. మైకులో రామాయణ సుభాషితాలు వినసొంపుగా వినబడుతున్నాయి. నెమ్మదిగా ఆ రెండు రోజులు వారితో మమేకం కాసాగాడు కామేష్.

"ఎందుకురా! ఎదురుగా మధులతా ఇంటర్నేషనల్ ఉంటేనూ!!" శర్మ మాటకి ఒక్కసారి గతాన్ని వీడి వర్తమానం వైపు చూశాడు కామేష్.



రత్నగిరి నుండి సత్యదేవుని సుప్రభాతం వీనులవిందుగా విన్పిస్తోంది.

"నాకు పవిత్రమైన ఇటువంటి అవకాశం మళ్ళీరాదు... ప్లీజ్!"

కామేష్ మాటలు ఆనందాన్ని కల్గించాయి చలపతి, శర్మలకు.

"దట్స్ గుడ్... సత్రం భోజనం... మఠం నిద్ర" వాళ్ళ మాటలు పట్టించుకోకుండా వాళ్ళ సూట్‌కేసులను కూడ తానే అందుకొని అటు వైపు అడుగులు వేశాడు కామేష్. దూరంగా కన్పిస్తున్న పంపానది పండగ వాతావరణాన్ని నింపుతోంది ఆ యువకునిలో.

మనిషి పుట్టినప్పటినుండి వాదాల ప్రభావంతో అంతా తాను అనుకుంటున్నాడు. క్రమంగా తాను నుండి తానేమిటి? అన్న ప్రశ్న ఉదయిస్తూనే ఉంది.

ఉదయాన్నే కార్యక్రమాలు ముగించుకున్నారు మిత్రులు ముగ్గురూ. "స్వాములూ ఫలహారం సిద్ధం" దూరంగా విన్పిస్తున్న సత్యదేవ వ్రత కథను ఆలకిస్తున్న కామేష్ అటు తిరిగాడు.

హృదయం ఆనందభరితమైంది.

"ఫలహారం స్వామీ... దయ చేయండి" హాయిగా నవ్వింది. ఆ చిరునవ్వుకి రత్నగిరి మొత్తం చిగురించినట్లయింది.

మడి, దడి, శుచి శుభ్రాలతో స్వచ్ఛందంగా విరబూస్తున్న ముద్దమందారంలా ఉంది ఆ అమ్మాయి.

"రారా! లేట్ అయితే సెకెండ్ బ్యాచ్ వరకూ వెయిట్ చేయాలి!" చలపతి, శర్మ పరుగులాంటి నడకతో ముందుకు కదిలారు.

"మరి మీరు...మరోసారి నవ్వింది, కామేష్‌ని కళ్ళతో పలకరిస్తూ. తెలియరాని అనుభూతితో ముందుకు కదిలాడు.

సత్యదేవుని నిలువెత్తు పటానికి హారతినిచ్చి సత్రం నియమ నిబంధనలని తెలియజేస్తున్నారు యజమాని. కామేష్‌కి ఇవేమీ పట్టడం లేదు. ఏదో పులకింత... మరేదో అనుభూతి.

ఆరోజు దేవుని దర్శనం బాగానే అయింది. పంపానదిలో స్నానం జేస్తే పాపాలు దరి జేరవని ఎవరో అన్నారు. ముగ్గురూ అటువైపు నడిచారు. చూసుకోకుండా అడుగులు వేసినందుకు పంపానది పాంచాల మీది పాకుడుకు పట్టుతప్పి జారి కాలు బెణికినట్లయింది కామేష్‌కి.

పెద్దగా వాపు లేకపోయినా నొప్పి ఎక్కువగా ఉండటంతో అలాగే కష్టంమీద సత్రంకు జేరారు ముగ్గురు మిత్రులు.

డాక్టర్‌ని సంప్రదించక తప్పలేదు.

"రెండు మూడు రోజులు ఎక్కడికీ కదలకుండా రెస్ట్ తీసుకోవడం శ్రేయస్కరం" ఇంజక్షన్ చేసి మందులు రాసి ఇస్తూ అన్నాడు ఆయన.

"మనం అనుకున్న ప్రకారం నేనెలాగూ రాలేను. మీరైనా వెళ్ళి సింహాచలం, ద్రాక్షారామం, కోటిపల్లి చూసిరండి. అంతవరకు ఇక్కడ రెస్ట్ తీసుకుంటాను నేను".

కామేష్ ప్రతిపాదన సహేతుకంగానే అన్పించింది వారికి.



"సరే! ఫ్రాక్చర్ ఏమీ లేదుగా...రెస్ట్ తీసుకుంటే రిటర్న్‌లో నిన్ను పిక్అప్ చేసుకుంటాం" వాళ్ళు వెళ్ళిపోయిన తరువాత ఆ రూమ్‌లో ఏకాకి అయ్యాడు కామేష్.

ఓ విధంగా పంపానది స్నానం అతనికి మంచి పనే జేసింది. ఒకింత ఏకాంతాన్ని కల్గజేసింది.

"ఏం కామేష్‌గారూ! ఎలా ఉంది మీ లెగ్ పెయిన్" నవ్వుతూ కాఫీతో వచ్చి పలకరించింది ఆ అమ్మాయి.

"ఇంతవరకు ఉంది. మీరు వచ్చారు ఇట్స్ గాన్".

హాయిగా నవ్వింది. ఎందుకో వచ్చినప్పటి నుండి ఆ అమ్మాయి నవ్వు అతన్ని కట్టిపడేస్తోంది.

"లంచ్‌కి రాలేను".

"పోన్లెండి బాక్స్ వస్తుంది".

"ఇక్కడ...బయటకి..."

"పంపించేందుకు నేనున్నా కదా సార్! కళ్ళతో మెరుపులాంటి చూపు విసిరి మాయమైపోయిందా అమ్మాయి.

అపర్ణ వెళ్ళిన వైపు చూస్తుండిపోయాడు. ఈ నాలుగు రోజులలో ఆమె తోటి పరిచయం అనుభూతులను అధిగమించి అనురాగంవైపు కదులుతున్నట్లుంది.

చక్కని మాట తీరు...మాటలలో అభిమానం...మంద్రత గొలిపే యవ్వనం...ప్రేరేపింపజేసే అవయవ సంపద. కామేష్‌లో ఏదో మధురమైన బాధ. దాని నడుమ తనలో కరడుగట్టిన చిరకాల వేదన. దానికి ప్రతీకలా ఆ సత్రంలోని పారిజాతం అపర్ణ కనబడుతోంది.

కాలు నొప్పితో బాధపడుతూంటే మందులు తెప్పించి పెట్టడం, కూర్చుని నాలుగు మంచి మాటలు చెప్పడం లాంటివి చేసి మెప్పిస్తోంది.

చక్కని మాట తీరు...మాటలలో అభిమానం...మంద్రత గొలిపే యవ్వనం...ప్రేరేపింపజేసే అవయవ సంపద. కామేష్‌లో ఏదో మధురమైన బాధ. దాని నడుమ తనలో కరడుగట్టిన చిరకాల వేదన. దానికి ప్రతీకలా ఆ సత్రంలోని పారిజాతం అపర్ణ కనబడుతోంది.

ఆనాటి సాయంత్రం కావాలనే ఆహ్వానించాడు కొండమీదకు తోడుగా. రత్నగిరి మెట్లమీద నడుస్తున్నారు.

"చూసుకు నడవండి" సూచనలిస్తోంది అపర్ణ.

ఓ మజిలీ దగ్గర ఆగిపోయాడు. కిందకు చూశాడు. ఎందుకో నవ్వు వచ్చింది. పకపకా నవ్వాడు కామేష్.

"మేం తెలుసుకోకూడని సంతోషమా!" అరోక్తిగా ఆగిపోయింది.

"రాజ్యలక్ష్మి... చంద్రమోహన్...శంకరాభరణం...ప్రేమాయణం".

"ఓ అదా... బాగా గుర్తు చేశారే!" అతని నవ్వుతో తనూ జతకల్పింది అపర్ణ.

"మరి విసరడానికి గ్లాసు ఎక్కడా కన్పించదే!"

"అసలు నా మనసే విసిరివేయబడిందిలెండి!" ఆగిపోయాడు అమ్మాయి ఏమంటుందో అన్న సంశయంతో.

"నేను పట్టుకున్నాను లెండి" మాటకు మాటని జత కలుపుతూ అంది అపర్ణ. ఆశ్చర్యమేసింది కామేష్‌కి. నమ్మబుద్ధి కావడం లేదు. సత్రంలో వంటలు చేసుకొని బతుకెళ్ళదీసే అమ్మాయి...ఇలా తనతో...సరసోక్తులతో..." తన టార్గెట్‌ను ఛేదిస్తున్న భావన కామేష్‌లో.

"మొత్తానికి సినిమా సగంలో చంద్రమోహన్, రాజ్యలక్ష్మి ఒకటయ్యారు లెండి" అన్నాడు విప్పారిన కళ్ళతో.

"అయినా ఆ మాట చెప్పడానికి ఇంత లేటా...అంత సంశయమా!" ప్రసాదశాల దగ్గరకు వచ్చారు. ఠక్కున గంట విన్పించింది గర్భగుడి శిఖరంపై నుండి. సత్యదేవుని దర్శనం ఇద్దరు కల్సి చేసుకున్నారు. అనుభూతుల తరంగాల మధ్య ఓలలాడసాగారు ఆ యువతీ యువకులు. మనసులు మమేకమవుతున్నాయి. హృదయాలు ఒకరికొకరు అంటున్నాయి.

గుండె భాషలు...తనువు వేదనలు ప్రోది అయి జగమంతా మధురమయ మంటున్నాయి.

** ** **

"ఇది ఇంకా కలగానే ఉంది సుమా! లేకపోతే గట్టుమీద చెట్టు...సముద్రంలోఉప్పు!!" అపర్ణను ప్రేమగా దగ్గరకు తీసుకుంటూ అన్నాడు కామేష్.

చెరిగిన కురులను సరిజేసుకుంటూ అతని గుండెలమీద వాలిపోయింది అనురాగమయిలా. బయట తాము బసచేసిన మధులతా ఇంటర్నేషనల్ హోటల్ బోర్డు చీకట్లో చిరుదీపంలా ప్రకాశిస్తోంది.

చిరుచెమటల మధ్య మరో సంగమానికి సమాయత్తమవుతున్న సాగర కెరటంలా ఉంది ఆ గదిలో వారి శారీరక స్థితి.

"రేపు చలపతి, శర్మ వస్తారు. ఊరువెళ్ళిన తరువాత అమ్మ నాన్నలతో సంప్రదించి పెళ్ళి ముహూర్తానికి ఏర్పాటు చేస్తాను...సరేనా!" కురుల చాటున వెలిగిపోతున్న కుర్రదాని మోమును చుంబిస్తూ అన్నాడు. అతన్ని అల్లుకుపోతున్న మల్లెతీగె అయింది ఆమె.

ఒక్కసారి గూడు కట్టుకున్న సంకుచిత భావం పురివిప్పినట్లుంది. చిరకాల వాంఛ ఏదో తీరిన భావన కామేష్‌లో. అధికారికంగా దగ్గరకు తీసుకున్నాడు అపర్ణని.

ఏదో సిస్టం కేలిబ్రేట్ అయినట్లుంది. నలిగిన చీరను, రేకలు విడుతూన్న జడమల్లెల్ని సర్దుకొని ఆ మంచంపై అతని నుండి పక్కకు జరిగింది.

కారణజన్ముడు ప్రపంచాన్నింతటినీ జయించిన భావన కామేష్‌లో. విజయగర్వంతో విషయాన్ని...తన ఉద్దేశాల్ని పూసగుచ్చినట్లు వివరించి చెప్పాడు. ఇన్నేళ్ళ తన కోరిక తీరినందుకు చాలా ఆనందంగా ఉంది కామేష్‌కి. మెచ్చిన వలపు చీకకు అంతా చెప్పిన తరువాత గాని అతని మనసు కుదుటపడలేదు. పెల్లుబుకుతూన్న మానస ధనంతో అద్దంలో చూసుకుంటూన్న కామేష్‌ని చూసి నవ్వుకొంది అపర్ణ.

ఆ క్షణంలో అతని వ్యవహారం ఓ మోసంలా...ఓ దగాగా ఏమీ అన్పించడం లేదు ఆమెకు. "అది అవకాశవాదమా!" మనసు ప్రశ్నిస్తోంది.

"ససేమిరా కాదు" తనకు తానే సమాధానమిచ్చుకొంది.

"నొచ్చుకుంటావనుకున్నాను...తప్పు చేశావని తిడతావనకున్నాను. మనసు విశాలత కలిగిన నిన్ను నాదాన్ని చేసుకోవాలనుకోవడం నిజంగా..."

నవ్వింది అపర్ణ. ఆ నవ్వులో మునుపటి సహజత్వం కానరావడం లేదు. ఏదో నిస్పృహ... తీక్షణ భావం నిండిన గొంతుతో నోరు విప్పింది.

"చిన్నతనంలోనే తల్లిని కోల్పోయిన అనాథను నేను. నాన్న ఆ ఇంటా, ఈ ఇంటా వంటలు చేసుకొని పొట్ట పోసుకొనేవాడు. అదేమిటో ఆయన కాయకష్టం చేస్తున్నా ఎప్పుడూ మమ్మల్ని దారిద్ర్యం వెంటాడుతూనే ఉండేది. మాకు స్ఫూర్తినిచ్చి బతుకుమీద ఆశ కల్పించిన మహనీయులు శ్రీమాన్ గణపతి శర్మగారు.

నన్ను, నాన్నను ఎంతగానో ఆదుకున్న మహనీయుడు ఆయన. నాన్న కాయకష్టం చేసి చేసి ఆ గాడిపొయ్యి ప్రమాదంలోనే కన్ను మూశాడు.

నాకప్పుడు పదిహేను సంవత్సరాలు. గణపతి శర్మగారి సేవలో బతుకంటే ఇది అని తెలుసుకోగలిగాను. మన సంస్కృతి విశిష్టత నన్ను ఎంతగానో ప్రభావితం జేసింది.

కానీ ఎవరు ఆపాలనుకున్నా ఆగని కాలం...కాలంతోబాటు పెరిగే శరీరం, ఊహలు, యవ్వనం, అందచందాలు...

పరువాలతో తొణికిసలాడే నన్ను ఈ సంఘం ఆకలిగా చూసేది, ఎరవేసేది, నువ్వు అనాథవు నీకు నేను తోడు అనేది, భయపెట్టేది, కుట్రపన్నేది. కుతంత్రాలతో వెంబడించేది. ఎలా దాక్కున్నా వెంటపడేది.నామనసంతా ఏదో మనోవేదనతో నిండిపోయింది. అప్పటికే గణపతి శర్మగారు కాలంజేశారు. నా కులం ఏమిటో, మతమేమిటో అన్నవి చూడకుండా తన కన్న కూతురులా ఆదరించిన సహృదయశీలి ఆయన. అప్పటినుండీ ఈ వైదిక సంస్కృతి అన్నా, బ్రాహ్మణ్యం అన్నా నాలో అచంచల విశ్వాసం.

ఎవరో ఇచ్చిన సలహాతో ఇక్కడికి చేరాను. నన్ను నేను ఆ వర్గపు మనిషిగా చిత్రించుకున్నాను. వేషభాషలలో గాని, కట్టుబాట్ల విషయంలో గాని ఎక్కువగా వైదీకంతో మమేకమై ఉన్న నన్ను ఎవరూ గుర్తించలేదు.

ఇది ఓ మహా పురుషుడు స్థాపించిన సంస్థ. పరస్త్రీలో తల్లిని చూసే సద్గుణాలున్న వ్యక్తుల వ్యవస్థ అనే ఉద్దేశంతో ఇక్కడ చేరాను. పవిత్రమైన భావనలు ఇక్కడ నన్ను నిలబెట్టాయి. ఇక్కడ నాకు, నా శీలానికి భద్రత అనే నమ్మకం కలిగింది. భౌతిక అంశాలకు అతీతమైన జీవన విధానం నన్ను ఎంతగానో సేదదీర్చగల్గింది.

ఒక కులంగాని, మతం కాని తన ఔన్నత్యం దేశ, కాల, మాన పరిస్థితులను బట్టి మారుతూ ఉండొచ్చు. కానీ దాని రూట్స్‌ని ఎవరూ పెకలించలేరు.

నన్ను ఓ చెల్లెలిగా, అక్కగా, కూతురిగా రాబందులకు...కామాంధులకు అతీతమైన జీవన స్రవంతి, అదీ ఒక్క చిన్న అబద్ధంతో. నాకు ఈ సాంఘిక భద్రత చాలు అన్పించింది. బతుకు హాయిగా సాగిపోతోంది.

కామేష్ ముఖంలో క్రమంగా రంగులు మారుతున్నాయ్.

"నిన్ను చూసిన తరువాత ఎందుకో నువ్వూ నాలాగే అన్పించింది. కానీ నువ్వు నన్ను తప్పక పెళ్ళి చేసుకుంటానని మాటిచ్చేసరికి నీ దారి నువ్వు చూసుకోమని నాలో అణగారిన కోరికలు ముందుకు ఎగదోసాయి. కల అనుకున్న పెళ్ళి 'కాదు నిజం' అనుకొనేసరికి ఒక పురుషుడికి జీవితంలో మొట్టమొదటసారిగా శరీరం విప్పారడం మొదలైంది. ఆ బలహీనమైన మధుర క్షణాలలో నీకు దేనికీ కాదనలేకపోయాను. కట్టుకోబోతూన్న భర్తతోనే కదా! అని మనసు నాకు సర్దిచెప్పింది!" చెప్పుకుపోతోంది అపర్ణ.

తనవనుకున్న మేధస్సు...పెంచిపోషించిన ఆధిపత్య ధోరణి...అణువు అణువులో ప్రోది జేసుకొని నిర్మించుకున్న సంకుచిత కుటీరం అన్నీ ఒక్కసారి ఫెళఫెళమంటూ కూలిపోతూన్నట్లుంది కామేష్‌కి.

తన మనసుని ఎవరో ఛెళ్ళున చరిచినట్లుంది. ఇక ఆమె మాటలు వినబడటం లేదు. జీవితంలో మొదటిసారి ఆత్మన్యూనతా భావన కట్టలు తెంచుకొని పొంగి పొరలుతోంది.

ఇప్పుడు మనసులో కామేష్‌కి వ ఎధుసూదనశాస్త్రిగారు రత్నగిరి అంత గంభీరంగా కన్పిస్తున్నారు. అతనిలో ఈ శుభానుభూతికి సంకేతమంటూ అల్లంత దూరంలో పురోహితుల ఆశీర్వచన మంత్రాలు స్పష్టంగా వినిపిస్తున్నాయి. ●

# వ్యర్థాశ్రమం

వార్ధక్యం ద్వితీయ బాల్యం
అన్నాడొక ఆంగ్ల కవి!
ఎలా నడవాలో తెలుసుకాని నడవలేని స్థితి.
కళ్ళు కనపడవు! చెవులు వినపడవు!
అన్నీ ఎలా చెయ్యాలో తెలుసు,
ఏం చెయ్యలేం.
మొదటి బాల్యం అలాకాదు!
ఏమీ తెలియదు!
ఏం చెయ్యాలో తెలియదు!
అన్నీ నేర్పి, ఒక మనిషిని చేస్తుంది
మాతృమూర్తి
అహర్నిశలూ పిల్లల మీదే ధ్యాస.
అందునా, వెనకపడిన పిల్లలంటే
అమిత ప్రేమ.
ఎవరైనా నీకే పుష్పం యిష్టమంటే,
ఆలోచించి రంగు సువాసన ఎక్కువవున్న
పుష్పం పేరు చెపుతాం!
అమ్మ అలా కాదు! తన పిల్లలలో
పరిమళించని పూవుని ఎన్నుకుంటుంది!
తన మనో పుష్ప పరిమళాన్ని, యీ పువ్వుకి
ఆపాదించ, కొంత సువాసన
వెదజల్లేటట్లు చేస్తుంది.
అందుకే దైవ సమానురాలు అమ్మ!
దయామూర్తి యీ మాతృమూర్తి.
మన మొదటి బాల్యంలో
సకల సేవలూ పొంది,
తన రెండో బాల్యంలో వున్న అమ్మని
వదిలేయడం కృతఘ్నతే కదా!
పైగా యింట్లో యీ బెడదెందుకని
వృద్ధాశ్రమంలో చేర్చడం.
మొదటి బాల్యంలోని మనల్ని పాఠశాలలో
చేర్చినట్టు!
కొడుకులు కానరానిది స్వర్గమైనా,
అది అమ్మకు నరకమే!
అందుకే ఆ వృద్ధాశ్రమం
అమ్మకి వ్యర్థాశ్రమమే!

- భమిడిపాటి సోమయాజి